జీతాలు ఆపేస్తే ఎలా బాబూ?

- పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు
- ఐదు నెలలకుపైగా అందని జీతాలు
- ప్రభుత్వం జీతాలిచ్చి, ఆదుకోవాలని వినతి

పెనమలూరు: ఒకటి కాదు, రెండు కాదు, ఏకంగా ఐదు నెలలకు పైగా అయింది ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఆయమ్మలకు (శానిటేషన్ వర్కర్లు) జీతాలు ఇచ్చి. జీతాలు లేకుండా ఎలా బతకాలని ఆయమ్మలు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలల పని తీరు నానాటికీ దిగజారిపోతుందన్న ఆరోపణలకు ఆయమ్మల జీతాలు ఇవ్వక పోవటమే నిదర్శనం.

పెనమలూరు మండలంలో ప్రభుత్వ పాఠశాలలు 35 ఉన్నాయి. వీటిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఆరు, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు నాలుగు, ప్రాథమిక పాఠశాలలు 25 ఉన్నాయి. దాదాపు ఐదు వేల మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో చదువుతున్నారు. కాగా పాఠశాలల్లో విద్యార్థుల అవసరాలకు శానిటేషన్ వర్కర్లు (ఆయాలు) దాదాపు 50 మంది వరకు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు ఒకరు, జిల్లాపరిషత్ పాఠశాలలో 300 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున ఆయాలు ఉన్నారు. వీరు ఉదయం 8.30 గంటలకు వచ్చి పాఠశాలలో పనులు చేసి సాయంత్రం 6 గంటలకు ఇళ్లకు చేరుకుంటున్నారు.



తాడిగడప పాఠశాలలో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్ (ఫైల్)

విధులు ఇవీ..

శానిటరీ వర్కర్లు ప్రతి రోజూ పాఠశాలల్లో తరగతి గదులను శుభ్రం చేయటం, టాయిలెట్లు శుభ్రపరచడం, భోజనాలకు ప్లేట్లు కడగటం, పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచటం, ప్రధానోపాధ్యాయులు పురమాయించిన పనులు ఇలా అనేక శానిటేషన్ పనులు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో సకాలంలో వేతనాలు తీసుకుంటూ అంకిత భావంతో పనిచేశారు.

సమస్యలు ఇవీ..

తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఆయాలు కోరుతున్నారు. శానిటరీ పరికరాలు ఇవ్వాలని, అలాగే గుర్తింపు కార్డులు జారీ చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని, ప్రతి నెలా 5వ తేదీ నాటికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. రెండు జతల యూనిఫారం ఇవ్వాలని, గ్రామాలలో రాజకీయ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కోరుతున్నారు.

ఐదు నెలలుగా జీతాలు లేవు..

కాగా ప్రభుత్వం ఆయాలకు నెలకు రూ.6 వేల జీతం ఇస్తుంది. గత ప్రభుత్వ హయాంలో జీతాలు సకాలంలో చెల్లించారు. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారింది. కూటమి ప్రభుత్వం గత 5 నెలలకుపైగా ఆయాలకు జీతాలు ఇవ్వటం లేదు. రూ.6 వేలు జీతం కుటుంబ అవసరాలకు సరిపోవటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయాలు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం గత 5 నెలలకు పైగా జీతాలు ఇవ్వక పోవటంతో అప్పుల పాలవుతున్నారు. జీతాలు అందుతాయనే ఆశతో భారంగా విధులు నిర్వహిస్తున్నారు.

వెంటనే జీతాలు ఇవ్వాలి..



కూటమి ప్రభుత్వం ఆయాలకు వెంటనే జీతాలు ఇవ్వాలి. జీతాలు లేకుండా ఆయాలు, వారి కుటుంబాలు ఎలా బతుకుతారు. పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఆయాల సమస్యలు ప్రభుత్వం పరిష్కారం చేయాలి. లేని పక్షంలో న్యాయం కోసం పోరాటం చేస్తాము.

– ఉప్పాడ త్రిమూర్తి, సీఐటీయూ మండల కార్యదర్శి, పెనమలూరు

ఇబ్బందుల్లో ఉన్నాం..



ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న శానిటేషన్ వర్కర్లకు ఐదు నెలలకు పైగా జీతాలు ఇవవటం లేదు. నెలనెలా జీతాలు రాకపోవటంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాం. తమ సమస్యను ప్రభుత్వం గుర్తించి వెంటనే జీతాలు ఇచ్చి న్యాయం చేయాలి. పాఠశాలల్లో అంకిత భావంతో పనిచేస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలి.

– గీత, ఆయా, తాడిగడప

మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



తాడిగడపలో మినుము పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త సుధారాణి, ఏవో శైలజ

పెనమలూరు: మినుము పంటకు లద్దె పురుగు ఆశించిందని, దాని నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్త డి.సుధారాణి అన్నారు. ఆమె మంగళవారం తాడిగడప గ్రామంలో మినుము పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం మినుము పంటలో లద్దె పరుగు ఉధృతంగా ఉందన్నారు. వాతావరణ పరిస్థితులు, తేమ శాతం ఎక్కువగా ఉండటం, వర్షం కారణంగా లద్దె పురుగు వ్యాప్తి చెందుతోందన్నారు. మినుము పంటకు మోతాదు మించి పురుగుల మందులు, రసాయన మందులు వాడటం వలన పురుగు ఇంకా పెరుగుతందని వివరించారు. అద్దె పురుగు ఆశిస్తే ఆకు తెల్లగా జల్లెడలా మారుతుందని, పురుగు పెరిగితే పూత, పిందెను కూడా తింటుందన్నారు.

నివారణ చర్యలు..

లద్దె పురుగు నివారణకు శాస్త్రవేత్త సుధారాణి పలు సూచనలు చేశారు. ఆకులపై పురుగు గుడ్లను తొలగించాలన్నారు. ఆకులపై గుడ్లు ఎక్కువకుండా వేప నూనె పిచికారీ చేయాలని సూచించారు. పురుగు మధ్యస్థంగా ఉంటే క్లోరిపైరిపాస్ 2.5 మి.లీ, లేక ఎసిఫేట్ 1.0 గ్రాము, లేక థయోడాకార్బ్ 1.0 గ్రాము లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలన్నారు. పురుగు ఉధృతి పెరిగితే 5 కిలోల తవుడు, అర కేజీ బెల్లం, క్లోరిపైరిఫాస్ 500 మి.లీ, సరిపడ నీటిలో కలిపి విషపు ఎరను తయారు చేసి సాయం సమయంలో వెదజల్లాలన్నారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.సునీల్, ఎంఏవో కనకమేడల శైలజ, వీఏఏలు గోవర్ధని, శ్రీవాణి, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన పునీత ఫ్రాన్సిస్ శౌరి మహోత్సవాలు



ప్రత్యేక ప్రార్థనలో బిషప్ జోసఫ్ రాజారావు

అజ్జంపూడి(గన్నవరం): మండలంలోని అజ్జంపూడి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న పునీత ఫ్రాన్సిస్ శౌరి మహోత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న విజయవాడ మేత్రాసన పీఠాధిపతులు బిషప్ తెలగతోటి జోసఫ్‌రాజారావు నేతృత్వంలో సమష్టి దివ్యపూజాబలి జరిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ.. క్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ప్రేమ, దయ, కరుణ వంటి సద్గుణాలను కలిగి ఉండి తోటివారికి సాయపడాలని చెప్పారు. క్రీస్తు సువార్తను ప్రపంచ దేశాలకు విస్తరించడంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి విశేష కృషి చేశారని తెలిపారు. తన జీవితాన్ని సంపూర్ణంగా, హృదయపూర్వకంగా దేవునికి, ప్రజలకు అర్పించిన మహనీయుడిగా అభివర్ణించారు. అటువంటి మహోన్నతుడైన వ్యక్తిని పునీతునిగా ఎంపిక చేసుకున్న అజ్జంపూడి గ్రామస్తులు అదృష్టవంతులని తెలిపారు. అనంతరం పునీత ఫ్రాన్సిస్ జేవియర్ గాయక బృందం ఆలపించిన భక్తి గీతాలు, వెల్లటూరు నిత్యసహాయమాత బృందం కోలాట నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. సాయంత్రం పునీత శౌరి స్వరూపంతో ఊరేగింపు నిర్వహించారు. అజ్జంపూడి విచారణ గురువులు, మత కన్యలు, కథోలిక సంఘం పెద్దలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయ ఆట్యా పాట్యా పోటీలకు ఎంపిక



మల్లిఖార్జునరావు



నాగబాలాజీ

గన్నవరం: జాతీయ స్థాయి ఆట్యా పాట్యా పోటీలకు స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌చార్జ్ హెచ్ఎం పి.ఉమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. భీమవరంలో నవంబర్ 30న జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పి.మల్లిఖార్జునరావు, జి.నాగబాలాజీ తృతీయ స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు. వీరి ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారన్నారు. జనవరి 2 నుంచి 5వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి ఆట్యా పాట్యా పోటీల్లో ఇరువురు విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

నీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం కావాలి



కంకిపాడు: నీటి సంఘాల ఎన్నికలకు సన్నద్ధం కావాలని తహసీల్దార్ వీ భావనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నీటి సంఘాల ఎన్నికలపై మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ భావనారాయణ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతుందన్నారు. షెడ్యూల్ ప్రకటనలకు అనుగుణంగా ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితాను సరిచూసుకోవాలని, షెడ్యూల్ రీత్యా ఎన్నికలను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ పి.అనూష, ఏఓ పి.మాధురీకిరణ్, ఇరిగేషన్ ఏఈ నాగబాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగులను వేధించటం తగదు

ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి



ఆస్పత్రిలో మహేష్‌ను పరామర్శిస్తున్న దేవరపల్లి సురేష్‌బాబు

పెనమలూరు: అధికారులు ఉద్యోగులను దుర్భాషలాడి వేధించటం తగదని ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు అన్నారు. ఆయన పోరంకి క్యాపిటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అవనిగడ్డ ఆర్టీసీ డిపో డ్రైవర్ మహేష్ బాబును మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ డీపీటీవో అధికారంతో దుర్భాషలాడటం కారణంగా మహేష్‌బాబు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. ఉన్నతాధికారులు ఉద్యోగులతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. అధికారులు అధికారం ఉందికదాఅని ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. కండిషన్‌లో లేని బస్సులు ఇచ్చి ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత చేపడతారని ప్రశ్నించారు. బస్సును పెను ప్రమాదం నుంచి డ్రైవర్ మహేస్‌బాబు తప్పించితే అభినందించాల్సింది పోయి సాటి ఉద్యోగుల సమక్షంలో అవమానించటం తగదన్నారు. ఈ విషయం ఆర్టీసీ ఎండీ దృష్టికి తీసుకువెళతామని అన్నారు. సమస్యలు వచ్చినప్పుడు ఉద్యోగులు ధైర్యంగా ఉండాలని, ఆత్మహత్యాయత్నాం చేయటం తగదని హితవు పలికారు.

దివ్యాంగ పిల్లలకు సంక్షేమ పథకాలు

పెనమలూరు: దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పించాలని డీవైఈవో పద్మారాణి అన్నారు. స్థానిక మండల వనరుల కేంద్రంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీవైఈవో పద్మారాణి మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలను బడిలో చేర్పిస్తే సమగ్ర శిక్ష అందించే ఉపకరణాలు, అలవెన్సులు, ఫిజియోథెరపీ సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. ఎంఈవో–1 శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిత కేంద్రాలకు వచ్చే విధంగా తల్లి తండ్రులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఎంఈవో– 2 కనకమహాలక్ష్మి మాట్లాడుతూ దివ్యాంగుల విద్యార్థులకు ఆత్మస్థైర్యం నింపే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పని చేయాలన్నారు. దాత పవిత్రకల్యాణ్ చిన్నారులకు పరుపులు, దిండ్లు, టేబుల్ ఫ్యాన్లు అందజేశారు. ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీ, సీఆర్‌పీ, ఎంఆర్‌సీ, తల్లితండ్రులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి..

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రంలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు సమగ్రశిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ రాములు నాయక్, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ. గౌసాని, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ దివ్యాంగులైన పిల్లల విద్యాభ్యున్నతికి, వైకల్యాన్ని నియంత్రించేందుకు భవిత కేంద్రాలు తోడ్పాటునందిస్తున్నాయని తెలిపారు. భవిత కేంద్రాల సేవలను దివ్యాంగులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



గన్నవరంలో మాట్లాడుతున్న ఏపీసీ నాయక్

ఎంపీడీఓ టి. స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యులు కౌంతి కిషోర్, జెడ్పీ బాలికల హైస్కూల్ హెచ్‌ఎం ఝాన్సీ రాణి, సిల్వర్‌జూబ్లీ స్కూల్ హెచ్‌ఎం ఝాన్సి, సహిత విద్య జిల్లా సమన్వయకర్త ఎస్.రాంబాబు, రిసోర్స్ పర్సన్ శ్రీనివాసరావు, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: దివ్యాంగుల దినోత్సవం కంకిపాడు ఎంపీపీ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. కంకిపాడు ఎంపీటీసీ సభ్యుడు చిట్టూరి ప్రసాద్ మాట్లాడారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం జీబీకే సుధారాణి, ఎంపీఎంపీఎస్ హెచ్‌ఎం పి.సాంబశివరావు, ఐఈ రీసోర్సు టీచర్లు ఎం.దీప్తి, పివిడి నాగేశ్వరి, సీజీవీ బీవీ నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: నాగవరప్పాడు భవిత కేంద్రంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, బాస్కెట్ అండ్ బాల్, వివిధ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు కాంప్లెక్స్ చైర్‌పర్సన్ సీహెచ్ అనిత బహుమతులు అందించారు. ఐ.ఇ.ఆర్.పీ భాగ్యలక్ష్మి, నాగవరప్పాడు ప్రధానోపాధ్యాయులు మధుసూదనరావు, మండల ఐ.ఇ.డి.ఎస్.ఎస్ విజయకుమారి, వేంపాడు ఉపాధ్యాయులు సీహెచ్ దాసు, ఫిజియోథెరపిస్ట్ నాగమల్లేశ్వరరావు, సీఆర్‌పీ కవితశ్రీ పాల్గొన్నారు.



దివ్యాంగ చిన్నారికి పరుపు, దిండు అందజేస్తున్న దాత పవిత్రకల్యాణ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఆశాజ్యోతి దివ్యాంగుల సొసైటీ, ఆదిత్య బధిరుల పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు మానవత సభ్యుల చేతుల మీదగా బహుమతులు పంపిణీ చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు, హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు గూడపాటి జయరామచంద్రరావు, పాబోలు గణేష్, కోశాధికారి ఇందిరాదేవి, సీనియర్ సభ్యులు జన్యావుల సత్యనారాయణ, వేగిరెడ్డి సూర్యనారాయణ, సుబ్బాచారి, పొట్లూరి శేషాచలం పాల్గొన్నారు. బాపులపాడు మండలం వీరవల్లిలోని భవిత కేంద్రంలో శారీరక, మానసిక దివ్యాంగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మోహనకృష్ణ, గుండపనేని ఉమావరప్రసాద్, అమృతపల్లి సూర్యనారాయణ, మండాది రవీంద్ర, ప్రత్యేక ఉపాధ్యాయులు కె.సుశీల, జె.నాగమణి పాల్గొన్నారు.



హనుమాన్‌జంక్షన్ రూరల్ పరిధిలో విజేతలతో మానవత సభ్యులు



కంకిపాడులో బహుమతులు అందుకున్న దివ్యాంగ చిన్నారులు



నాగవరప్పాడులో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న కాంప్లెక్స్ చైర్‌పర్సన్ అనిత

క్రైమ్ కార్నర్

కట్నం వేధింపులపై కేసు

పెనమలూరు: కట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం .. గంగూరుకు చెందిన బిందుశ్రీ గత 2023 సంవత్సరంలో ఏసుబాబును కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త కారు డ్రైవర్‌గా పని చేస్తాడు. భర్త దురలవాట్లకు బానిసగా మారి అదనపు కట్నం తీసుకు రమ్మని భార్యను వేధించసాగాడు. భర్తతో పాటు అత్త నాగమణి, అత్త తల్లి మహంకాళి, ఆడపడుచు మేరీ కూడా వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు అత్తింటివారిపై వరకట్నం వేధింపు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై ముగ్గురు దాడి

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఓ వ్యక్తిపై ముగ్గురు దాడి చేసి గాయపర్చడంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు సాయిబాబా గుడి ప్రాంతానికి చెందిన కొల్లాటి సత్యనారాయణ కొద్ది రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు వద్ద రూ.20 వేలు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న సొమ్ము వెంటనే చెల్లించాడు. అయితే అప్పు విషయంలో సత్యనారాయణను వెంకటేశ్వరరావు మరలా సొమ్ము అడుగుతుండటంతో వీరి మధ్య వివాదం ఏర్పడింది. కాగా సోమవారం సత్యనారాయణ లాకుల వద్ద చేపల మార్కెట్‌కు వెళ్లాగా అక్కడకు వచ్చిన వెంకటేశ్వరరావు అతని బంధువులు కొక్కిలిగడ్డ శ్రీనివాసరావు, పవన్‌లు తగాదా పెట్టుకున్నారు. దీంతో సత్యనారాయణపై బండరాయితో దాడి చేసి పిడిగుద్దులు గుద్దారు. ఈ ఘటనలో గాయపడిన సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యం

పెనమలూరు: కానూరులో యువకుడు అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముసునూరు మండలం నాగేంద్రపురానికి చెందిన షేక్ రసూల్‌కు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు లాల్‌మొహమ్మద్ (32) విజయవాడ ప్రైవేటు కంపెనీలో పని చేస్తూ కానూరు గాంధీ బొమ్మల సెంటర్‌లో రూమ్ అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. అతనికి గత నెల 3వ తేదీన కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. రూమ్‌మెంట్ ప్రసన్నకి ఫోన్ చేసి అడగ్గా సోదరి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడని తెలిపాడు. లాల్ మొహమ్మద్ కోసం కుటుంబ సభ్యులు గాలించినా జాడ తెలియక పోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు ఉపాధి పథకంతో ఆర్థిక చేయూత

కృత్తివెన్ను: పేదలకు ఉపాధి పథకంతో ఆర్థిక చేయూత అందుతోందని డ్వామా పీడీ ఎన్.వి.శివప్రసాద్ యాదవ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పథకం ద్వారా ప్రస్తుతం మినీగోకులం పేరుతో పశుశాలల నిర్మాణం జరుగుతోందని, వాటి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. 2023– 24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై వారం రోజులుగా సోషల్ ఆడిట్ బృందాలు గ్రామాల్లో నిర్వహించిన తనిఖీల నివేదికలను ప్రజావేదికలో వెల్లడించారు. 2023– 24లో మండలంలో 1,473 పనులకు రూ.9.76 కోట్లు వెచ్చించినట్లు ఎస్ఆర్‌పీ సత్యనారాయణ తెలిపారు. వీటిపై సోషల్ ఆడిట్ జరిగిందన్నారు. మొత్తం 16 పంచాయతీల్లో రూ.2.17 లక్షలు రికవరీకి ఆదేశించామన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రామ్మోహన్, విజిలెన్స్ అధికారి సురేష్, జెక్యూసీ ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏపీఓ సైదారావు, ఈసీ నాగ సురేష్, డీఆర్‌పీ, ఎఫ్ఏలు, ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపు

- శిథిలమైన కల్వర్టు రక్షణ గోడ
- పట్టించుకోని అధికారులు
- యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు



గొడవర్రు ప్రధాన గ్రామంలో మలుపువద్ద శిథిలమైన కల్వర్టు రక్షణ గోడ

కంకిపాడు: కల్వర్టు రక్షణ గోడ శిథిలం కావటంతో రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. యథేచ్ఛగా భారీ లోడు వాహనాలు రాకపోకలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారు. ఫలితంగా సామాన్య ప్రజానీకం రాకపోకలు సజావుగా సాగక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి స్థానికంగా నెలకొంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని గొడవర్రు– రొయ్యూరు గ్రామాలకు జెడ్పీ రోడ్డు ప్రధాన రహదారి మార్గంగా ఉంది. ఈ మార్గంలో గొడవర్రు గ్రామంలో ప్రధాన మలుపు వద్ద కల్వర్టు ఉంది. ఈ కల్వర్టు మీదుగా రొయ్యూరు, విజయవాడ– దివిసీమ కరకట్ట రహదారిని కలుపుతూ రహదారి మార్గం ఉంది. నిత్యం అధిక సంఖ్యలో వాహనదారులు ఈ మార్గం నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధానంగా దివిసీమకు చేరుకునే ప్రజానీకంతో పాటుగా, గన్నవరం పరిధిలోని విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులు ఈ మార్గాన్నే వినియోగిస్తున్నారు. కొద్ది కాలంగా వాహనాల తాకిడితో రోడ్డు అధ్వానంగా మారింది. తోట్లవల్లూరు మండలం రొయ్యూరు, కంకిపాడు మండలం మద్దూరు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు ఈ మార్గాన్నే రోడ్డు మార్గంగా వినియోగిస్తున్నారు. ఇసుక లోడు వాహనాలు కూడా ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తున్నాయి. ఫలితంగా రోడ్డు అధ్వానంగా మారింది. గోతులమయంగా తయారైంది. గొడవర్రు ప్రధాన మలుపు వద్ద ఉన్న కల్వర్టు రక్షణ గోడ కూలిపోయింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు, భారీ లోడుతో కూడిన వాహనాల రాకపోకలు అంటేనే స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు.

అధికారులు స్పందించి కల్వర్టు రక్షణ గోడలు నిర్మించాలని, రాకపోకలు సజావుగా సాగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

కంకిపాడు: వక్ఫ్ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులోని సంఘ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది ఎకరాల భూములు వక్ఫ్‌బోర్డు కింద ఉన్నాయన్నారు. వక్ఫ్‌బోర్డు లేకపోవటం, పర్యవేక్షణ సక్రమంగా జరగక పోవటంతో వక్ఫ్ భూములు ఆక్రమణకు గురవుతున్నాయన్నారు. వక్ఫ్‌బోర్డుకు తక్షణమే నూతన కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. ఆక్రమణ చెరలో ఉన్న వక్ఫ్ ఆస్తులను పునఃస్వాధీనం చేసుకుని వక్ఫ్‌బోర్డును పరిరక్షించాలని సూచించారు. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కరపత్రాల పంపిణీ

మోపిదేవి: విజయవాడలో జనవరి 5న నిర్వహించే హైందవ శంఖారావం బహిరంగ సభకు తరలి రావాలని విశ్వ హిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడే వర్రె రాజశేఖర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం మోపిదేవి ప్రధాన సెంటర్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచివిముక్తి చేసి, స్వయం ప్రతిపత్తి కల్గిన ఒక ఉత్తమ దార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్ట సవరణ చేయాలని విశ్వహిందూ పరిషత్ ఒక జాతీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టిందన్నారు.